క్లుప్తంగా

తాగునీటి కుళాయిల ప్రారంభం



కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

జి.సిగడాం: మండలంలోని రౌతుపేట, ముక్కుపేట గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. విద్య, వైద్య, తాగు, సాగునీరుపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఎంపీపీ మీసాల సత్యవతి, సర్పంచ్‌లు చందక శారద, గోక మహేశ్వర రావు, డ్వామా పీడీ చిట్టిరాజు, తహసీల్దార్ ఆర్.ఉమామహేశ్వరావు, డీఈఈ పైడి సూర్య నారాయణ, ఎంఈఓలు అరసాడ రవి, శ్రీనివాసరావు, ఏఈఈ బాగాది భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం జాడ గ్రామంలో మొక్కలు నాటారు. యూపీ పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు.

గొల్లపేటలో..

రణస్థలం: మండలంలోని మెంటాడ పంచాయతీ గొల్లపేట గ్రామంలో రూ.34.10 లక్షలతో జల్ జీవన్ మిషన్ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ బాకి లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తం



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న సర్పంచ్, వైద్య సిబ్బంది

జి.సిగడాం: గ్రామాల్లో డయేరియా వ్యాధిని నిర్మూలించడమే మనందరి బాధ్యతని బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు అనూష, ప్రతిజ్ఞ శర్మ అన్నారు. స్థానిక సర్పంచ్ డబ్బాడ కల్యాణి ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ నెల 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సురక్షితమైన తాగునీరు తీసుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు బూటు దమయంతి, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న డీఎస్పీకి సన్మానం



రమేష్‌ను సత్కరిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: డీఎస్పీగా పదోన్నతి పొంది బదిలీపై విజయవాడ పోలీస్ ప్రధాన కార్యాలయానికి వెళ్తున్న ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్) ఆర్ఐ టి.రమేష్‌ను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాధిక ఘనంగా సత్కరించారు. క్రమంలో ఎస్పీ ఏపీపీఎస్ లోగోతో కూడిన పోలీస్ క్యాప్, ఆంబ్లమ్ స్టార్స్‌ను రమేష్‌కు అందించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్, ఉమామహేశ్వరరావు, డీఎస్పీ ఎల్.శేషాద్రినాయుడు, ఏవో సీహెచ్ గోపీనాథ్, ఆర్ఐ నర్సింగరావు, పలువురు ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

విజయగణపతికి అభిషేకాలు



స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతికి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. అర్చకులు స్వామివారికి పాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలో గల ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయం ఆవరణలోని గంగామాత ఆలయంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే గోవిందనగర్ కాలనీలోని రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయం, నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామికి పూజలు జరిగాయి.

గుర్తింపు కార్డు తప్పనిసరి

- కౌలు రైతుల అవగాహన సదస్సులో వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్



గార: మాట్లాడుతున్న జేడీ శ్రీధర్

గార: కౌలు రైతులకు గుర్తింపుకార్డు తప్పనిసరిగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ జేడీ కె.శ్రీధర్ అన్నారు. దీని కోసం తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. రామచంద్రాపురం, గొంటి పంచాయతీల్లో కౌలు రైతులతో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట రుణాలు, ఈ-పంట నమోదు, అన్నదాత సుఖీభవ, పంట నష్ట పరిహారం, పంటల బీమా, పంట కొనుగోళ్లు, రాయితీపై వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు కొనుగోలు వంటి పథకాలకు గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయన్నారు. వెద సాగు పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ కె.కృష్ణారావు, ఏడీఏ టి.భవానీశంకర్, ఏవో డి.పద్మావతి పాల్గొన్నార.

కళ్లేపల్లిలో..

శ్రీకాకుళం రూరల్: కళ్లేపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి కౌలు రైతులతో గుర్తింపు కార్డుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌలురైతు గుర్తింపు కార్డు కలిగిఉంటే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగు నాగరత్నం, ఎంపీటీసీ సభ్యురాలు బాణ మంగమ్మ, నాయకులు మూకళ్ల శ్రీనివాస్, దుంగ శ్రీధర్, జయానంద్, సాధు శ్రీనివాసరావు ఉన్నారు.

యంత్రంతోనే వరిసాగు మేలు..

ఫెర్టికమ్‌సీడ్ డ్రిల్ యంత్రంతోనే వరిసాగు లాభదాయకమని మండల వ్యవసాయాధికారి ఉషా కుమారి అన్నారు. రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లేపల్లి గ్రామంలో రైతులకు ఫెర్టికమ్ సీడ్‌డ్రిల్ యంత్రంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వర్షధారణ తక్కువ ఉన్న ప్రాంతాల్లో లాభదాయక దిగుబడులు సాధించాలంటే వరి సాగు యంత్రాలతో చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఎకరాకు 16 కిలోల శుద్ధి చేసిన విత్తనాలతో పాటు ఎరువులను ఒకేసారి ఫెర్టికమ్‌సీడ్ డ్రిల్‌తోనే సాగు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ తవిటినాయుడు ఉన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: కౌలు రైతు ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయ శాఖ శ్రీకాకుళం డివిజన్ ఏడీఏ బగ్గు రజని అన్నారు. ఎచ్చెర్ల, జరజాం గ్రామాల్లో కౌలు రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. కౌలు రైతులు వ్యవసాయ శాఖ వద్ద రిజస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వ్యవసాయ రుణాలు, ఈ-క్రాప్ నమోదు, అన్నదాత సుఖీభవ పథకం, పంట నష్ట పరిహారం, పంట బీమా, పంట కొనుగోళ్ల, రాయితీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్ల కొనుగోళ్లలో రాయితీలు వంటివి వర్తిస్తాయన్నారు. అనంతరం రైతులకు ఎరువులు, విత్తనాలు రాయితీపై అందజేశారు. జలవనరుల కేంద్రం ఏడీ వెంకటరావు, వ్యవసాయ అధికారి సురేష్ పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్: కౌలు రైతుల జాబితాను విడుదల చేస్తున్న అధికారులు



శ్రీకాకుళం రూరల్: ఫెర్టికమ్‌సీడ్ డ్రిల్ యంత్రం వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో రైతులకు ఎరువులు అందజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

జూట్ బ్యాగుల తయారీపై శిక్షణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

శ్రీకాకుకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని బ్యాంకర్స్ కాలనీ సత్యసాయి సేవా సమితి సాయి బృందావనం ఆధ్వర్యంలో జూట్ బ్యాగుల తయారీ, స్క్రీన్ ప్రింటింగ్‌పై 30 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మహిళల కోసం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19 నుంచి 35 ఏళ్ల వయసులోపు మహిళలకు శాశ్వత స్వయం ఉపాధి కల్పించే నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు వివరాలకు 99480 04156, 94403 98049, 83319 00152 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి పి.నరసింహమూర్తి, నాగేశ్వరరావు, టి.ఎస్.ఎన్.మూర్తి, కన్వీనర్ ఎ.ప్రసాదరావు, శివకుమార్, బి.లిఖిత్, గంగాధర్ ఉన్నారు.

మొక్కలు నాటివేత



మొక్కలు నాటుతున్న సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మొదలవలస కృష్ణవేణి కోరారు. మహాలక్ష్మినగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఆర్ఎస్‌పీ ఫౌండేషన్ (ది వరల్డ్ ఆఫ్ సైకాలజీ) ఆధ్వర్యంలో మెరుగైన మానసిక ఆరోగ్యకర సమాజం కోసం చేస్తున్న యజ్ఞంలో భాగంగా కళాశాల అధికారులు, వైద్యులు, అటవీ అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ ఫారెస్ట్ ఆఫీసర్ ఏవీ నాగేందరరావు, న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ బెండి సాయిరాం, సైకాలజిస్ట్, ఆర్ఎస్‌సీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పొన్నాడ రాజశేఖర్, డాక్టర్ బుడుమూరు రమణ, డాక్టర్ గురుగుబెల్లి సందీప్, అనూష, కృష్ణ భార్గవి, అధ్యాపకులు అన్నపూర్ణారావు, కె.అప్పారావు పాల్గొన్నారు.

సీఏల పాత్ర కీలకం



సీఏలను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్థిక, వ్యాపార రంగంలో చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆడిటర్ల పాత్ర కీలకమని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. నగరంలోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు చార్టర్డ్ అకౌంటెంట్లను సన్మానించారు. క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, టెక్కం రాంగోపాల్, శిల్లా మణి, ఉర్లం శివ తేజ, పొడుగు చరణ్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చెక్‌ను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కరుణ సమాజంలోని అప్‌హోల్డ్ నగర్‌లో ఉంటున్న విద్యార్థిని గుడివాడ కీర్తన ముక్కుకు సంబంధించిన సమస్యతో బాధపడుతోంది. దీంతో ఆమె ఆపరేషన్ నిమిత్తం సంస్థ చైర్మన్ ఎం.ఢిల్లీరావు రూ. 60 వేలు సమకూర్చారు. దీనికి సంబంధించిన చెక్కును కీర్తన తల్లి శాంతికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో అప్‌హోల్డ్ సంస్థ కార్యవర్గ సభ్యుడు జామి అరుణ్ ఉన్నారు.

భూవివాదంపై కేసు నమోదు



బంటుపల్లికి చెందిన బాధితులు

రణస్థలం: మండలంలోని బంటుపల్లిలో మంగళవారం భూవివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో సోమయాదుల సీతమ్మ, శ్యామల, అప్పమ్మ, శ్రీనువాసరావులపై అదే గ్రామానికి చెందిన ఇజ్జు నారాయణరావు, దుర్గాప్రసాద్, పాశపు శ్రీనివాసరావు, గోవిందాసు శ్రీనివాసరావు దాడికి పాల్పడటంతోపాటు కులం పేరుతో దూషించారని జే.ఆర్.పురం పోలీసులకు బాధితులు తెలిపారు. ఈ దాడిలో సీతమ్మకు చేయి విరిగింది. మరో ముగ్గురు కుటుంబ సభ్యులకు గాయాలు కావడంతో వారంతా శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. అక్కడే ఉన్న ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల మెడికల్ లీగల్ రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జే.ఆర్.పురం ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు.

4న విద్యా సంస్థల బంద్



కాశీబుగ్గ: మాట్లాడుతున్న వినోద్

కోటబొమ్మాళి: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీని నిరసిస్తూ ఈ నెల నాలుగో తేదీన చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌కు యాజమాన్యాలు, విద్యార్థులు సహకరించాలని ఎన్‌హెచ్ఆర్ఎస్‌జేసీ శ్రీకాకుళం జిల్లా ముఖ్య కార్యదర్శి తంగుడు మణికంఠ కోరారు. కోటబొమ్మాళిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా తెలివైన, పేద విద్యార్థులు నష్టపోయారన్నారు.

–కాశీబుగ్గ: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల నాలుగో తేదీన చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్‌కుమార్ కోరారు. కాశీబుగ్గలో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రవికుమార్, విద్యార్థి సంఘ నాయకులు పవన్, తరుణ్, నాని, సాయి, కల్యాణ్ ఉన్నారు.

ఉపాధిలో ప్రథమ స్థానంలో నిలవాలి

- డ్వామా పీడీ చిట్టిరాజు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

జి.సిగడాం: ఉపాధి హామీ పథకం పనుల్లో రాష్ట్రంలోనే శ్రీకాకుళం జిల్లా మొదటి స్థానంలో నిలవాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. మండలంలోని ముషినివలస, రౌతుపేట, సర్వేశ్వరపురం, జాడ గ్రామాల్లో ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ తోటపల్లి, మడ్డువలస ప్రధాన కాలువల్లో పూడికలను ఉపాధి హామీ పథకం ద్వారా తొలగిస్తున్నామన్నారు. జి.సిగడాం మండలంలో 10 వేల మంది వేతనదారులకు 6 లక్షల పని దినాలను కల్పించడం జరిగిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సంలో ఉపాధి పనుల కోసం ప్రభుత్వానికి ప్రణాళికలు సిద్ధం చేసి నివేదిక పంపామన్నారు. ఏపీడీ లోకేష్, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురిషోతం నాయుడు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మోహనరావుకు 13 అవార్డులు



అవార్డులు అందుకుంటున్న మోహనరావు

శ్రీకాకుళం: జిల్లాలో రోటరీ క్లబ్ సెంట్రల్ ప్రెసిడెంట్ యెరుకోల మోహనరావుకు 2023-24వ సంవత్సరానికి 13 అవార్డులు దక్కాయి. విజయవాడలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ రావూరి సుబ్బారావుచే అవార్డులను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. జిల్లాలో అత్యధిక మెంబర్‌షిప్ తీసుకోవడం, అనేక సామాజిక సేవ కార్యక్రమంలో పాల్గొనడంతో బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు, ప్లాటినం, బంగారం, సిల్వర్ వంటి బహుమతులు అందుకున్నారు. బెస్ట్ అసిస్టెంట్ గవర్నర్ అవార్డు కేటీ నాయుడు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావులకు రోటరీ ఇంటర్నేషనల్ బహుమతులు అందజేశారు.

భయపెడుతున్న తీగలు!



ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగించే ఈ రోడ్డులో భయాందోళన కలిగించేలా పలు తీగలు దర్శనమిస్తున్నాయి. శ్రీకాకుళం నగరంలో వైఎస్సార్ కూడలి (ఏడురోడ్ల జంక్షన్) సిగ్నల్ పాయింట్ వద్ద కేబుల్, టెలీఫోన్ వైర్లు కిందకి వేలాడుతున్నాయి. పొరపాటున చూడకుండా వేగంగా వస్తే మెడకు తగిలి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి వీటిని సరిచేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



కేబుల్ వైర్లను తప్పించుకుని వెళ్తున్న ప్రయాణికులు

భద్రమ్మతల్లికి ముర్రాట్లు సమర్పణ



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: బలగ గ్రామదేవతగా కొలువైన భద్రమ్మతల్లి అమ్మవారికి మంగళవారం సందర్భంగా భక్తులు ముర్రాట్లు సమర్పించారు. మహిళలు తలపై కలశాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే గొండ శంకర్ దంపతులు దర్శించుకున్నారు.

జీవామృతం తయారీపై అవగాహన

ఎచ్చెర్ల: నేలలోని పోషకాలు అభివృద్ధి చెందడం కోసం పీఎండీఎస్, ఘన, ద్రవ జీవామృతాలు వాడుకోవాలని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి చంద్రకళ తెలిపారు. కేశవరావుపేట గ్రామంలో ఘన జీవామృతం తయారుచేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవామృతాలను వాడటం వల్ల భూమిలోని పోషకాలు అభివృద్ధి చెంది పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. సిబ్బంది పూర్ణ, రైతులు పాల్గొన్నారు.

అల్లినగరంలో 104 సేవలు

ఎచ్చెర్ల: మండలంలోని అల్లినగరం గ్రామంలో మంగళవారం 104 సేవలు అందించారు. దీర్ఘకాలిక రోగులకు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. ఆశ కార్యకర్తలు, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధుల వేతనాల్లో అవకాశం కల్పించాలి

టెక్కలి: ఎన్నికల విధులు చేపట్టిన సిబ్బందికి అదనంగా వేతనాలు ప్రకటించిన నేపథ్యంలో రెవెన్యూ వ్యవస్థలో ఎంతో కీలకంగా పనిచేసిన డ్రైవర్లకు కూడా అవకాశం కల్పించాలని అసోసియేషన్ ప్రతినిధులు ఓ ప్రకటనలో విన్నవించారు. ఎన్నికల సమయాల్లో రేయింబవళ్లు ఎంతో కీలకంగా పనిచేసిన డ్రైవర్లకు అదనంగా వేతనాలు ఇవ్వకపోవడం ఎంతో బాధాకరమని వాపోయారు. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

బోరుభద్ర మీదుగా విశాఖకు బస్సు సర్వీసు

టెక్కలి:

టెక్కలి నుంచి సంతబొమ్మాళి మండలం బోరుభద్ర మీదుగా నిమ్మాడ నుంచి విశాఖపట్టణానికి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసును మంగళవారం ప్రారంభించారు. ఇదే గ్రామాలను కలుపుతూ విశాఖపట్టణానికి బస్సు సర్వీసు కోసం ప్రజలు మంత్రి అచ్చెన్నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఆయన స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సును కేటాయించారు. ఆర్టీసీ సిబ్బంది సమక్షంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.శేషగిరి బస్సు సర్వీసును ప్రారంభించారు. డి.ప్రసాద్‌రెడ్డి, కె.రామ్‌ప్రసాద్, టీఎస్ఎన్ రమణ, ఆర్.ప్రీతీష్, వెంకట్‌రెడ్డి, జగదీష్‌యాదవ్, చంద్రరావు, పి.రమణ ఉన్నారు.

అతిసారంపై అప్రమత్తం



సరుబుజ్జిలి: అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



నరసన్నపేట: మాట్లాడుతున్న డాక్టర్ అరవింద్

సరుబుజ్జిలి: చిన్నారులకు వ్యాపించే నీళ్ల విరోచనాలు (అతిసారం) పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మోహన్‌రావు తెలిపారు. అతిసార వారోత్సవాల సందర్భంగా మండలంలోని రొట్టవలస విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మంగళవారం అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు, ఏఎన్ఎం తేజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

– నరసన్నపేట: వర్షా కాలంలో డయేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దీనిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి అరవింద్ అన్నారు. ఉర్లాంలో పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందితో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే తగిన వైద్యం అందించాలని, ఇతర కుటుంబ సభ్యులను అప్రమత్తం చేయాలని సూచించారు. అవసరమైన మందులు సబ్ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయన్నారు. సబ్ సెంటర్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డెంగీపై కూడా ప్రజలకు తగు సూచనలు చేయాలన్నారు.

ఆహారంలో మిల్లెట్లకు ప్రాధాన్యం



సమీక్ష నిర్వహిస్తున్న ప్రొఫెసర్ వివేకానంద ఝూ తదితరులు

వజ్రపుకొత్తూరు: రోజువారి ఆహారంలో మిల్లెట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని జార్జి ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్‌కు చెంది నెఫ్రాలజిస్ట్ ప్రొఫెసర్ వివేకానంద ఝూ అన్నారు. అక్కుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తన బృందంతో కలిసి మంగళవారం సందర్శించారు. అనంతరం ఎస్ఐహెచ్ఆర్-జీహెచ్ఆర్‌సీ కార్యక్రమాల్లో భాగంగా పౌష్టికారం, ఆహారపు అలవాట్లు, వజ్రపుకొత్తూరు మండలంలో కిడ్నీ వాధి తీవ్రతపై ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు , ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్ష నిర్వహించి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటా తిరిగే వారికి పూర్తి అవగాహన ఉంటుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. నిత్య జీవితంలో మిల్లెట్స్‌ది కీలక పాత్ర కాబట్టి పోషకాహారంలో భాగంగా చేసుకుని దీనిపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జె.చిన్ని, జార్జి ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ బాలాజీ, మిల్లెట్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ జోసెఫ్, ఫీల్డు కోఆర్డినేటర్ టి.దురోధనరావు పాల్గొన్నారు.